సాక్షి కామారెడ్డి

గురువారం । 1 । మే । 2025



ఘనంగా బసవేశ్వర..

కవి, ఆధ్యాత్మిక తత్వవేత్త, సంఘ సంస్కర్త బసవేశ్వర జయంతిని బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు.

- IIలో ▸



మాచారెడ్డిలో రైతుల..

నెలరోజులు గడిచినా ధాన్యం కాంటా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాచారెడ్డిలో రైతులు రాస్తారోకో చేశారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం

44.1 /24.2

వాతావరణం

ఉదయం నుంచి ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. అయితే ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు.

స్టేషన్‌లకు ప్రొబెషనరీ ఎస్సైలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ముగ్గురు ప్రొబెషనరీ ఎస్సైలకు శిక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్‌లను కేటాయిస్తు ఎస్పీ రాజేశ్‌చంద్ర బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ విధులు తెలుసుకునేందుకుగాను నెల రోజులపాటు ఆయా పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వర్తించనున్నారని ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపేట పీఎస్‌కు పి రాఘవేంద్ర, నస్రుల్లాబాద్‌కు అరుణ్‌కుమార్, రామారెడ్డికి నవీన్‌చంద్రను కేటాయించారు.

పదిహేను రోజుల్లో బస్టాండ్‌ను ప్రారంభిస్తాం



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను 15 రోజుల్లో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి 15 రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. అలాగే ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి జూన్ చివరిలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మధ్యంతరంగా నిలిచిన ఆర్టీసీ బస్టాండ్, వంద పడకల ఆస్పత్రి పనులకు మంత్రితో చర్చించి నిధులు మంజూరు చేయించామన్నారు. ఆయనవెంట మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మశ్రీకాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, పప్పు వెంకటేశం, రఫీక్, ఆరిఫ్, అజహర్ తదితరులున్నారు.

రేపు కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్ హాలులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, వ్యవసాయ సలహాదారు శ్రీనివాస్‌రెడ్డితోపాటు పార్టీ ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి జిల్లాలోని తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

పదిలో 20వ స్థానం

- ఎస్సెస్సీ ఫలితాల్లో వెనుకబడిన జిల్లా
- 94.65 శాతం ఉత్తీర్ణత నమోదు
- మరోసారి బాలికలదే పై చేయి
- జిల్లా స్థాయిలో దోమకొండ టాప్.. అట్టడుగున జుక్కల్
- గతేడాది 19వ స్థానం



కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా 20వ స్థానంలో నిలిచింది. ఈ సారి కూడా పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు నిరాశ పరిచారు. గతేడాది 19వ స్థానంలో ఉండగా, ఈ సారి ఒకస్థానం కిందికి పడిపోయింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

ఉత్తీర్ణులు 11,871 మంది..

జిల్లాలో 12,542 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 11,871 మంది ఉత్తీర్ణులయ్యారు. 671 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఉత్తీర్ణత 94.65శాతం నమోదయ్యింది. ప్రతిసారి లాగే ఈ సారీ బాలికలే పైచేయి సాధించారు. 6,414 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా.. 6155 మంది పాసయ్యారు. అలాగే 6,128 మంది బాలురులు పరీక్షలు రాయగా, 5716 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలాల వారీగా చూస్తే దోమకొండ మండలం వందశాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలవగా.. జుక్కల్ 59.48 ఉత్తీర్ణత శాతంతో అట్టడుగున ఉంది.

ప్రతిభ చాటారు. గతేడాది వరకు జీపీఏ గ్రేడ్ మార్కులతో ఫలితాలు వెల్లడించగా, ఈ సారీ మార్కులతో ఫలితాలను వెల్లడించారు.

మేనేజ్‌మెంట్ వారీగా ఫలితాలు ఇలా..

బీసీ వెల్ఫేర్(450 మంది విద్యార్థులు), రెసిడెన్షియల్స్‌లో(67 మంది విద్యార్థులు) వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో 85.60 శాతం, జెడ్పీ పాఠశాలల్లో 92.05, కేజీబీవీల్లో 96.30, మోడల్ స్కూళ్లలో 97.62, ప్రైవేట్‌లో 99.28, మైనారిటీ రెసిడెన్షియల్స్‌లో 94.94, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో 97.10, ట్రైబల్ వెల్ఫేర్‌లో 98.68, ఎయిడెడ్‌లో 94.12 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన స్కూళ్లు 146

జిల్లాలో 100 శాతం ఫలితాలు సాధించిన స్కూళ్లు 146 ఉన్నాయి బీసీ వెల్ఫేర్ - 7, ప్రభుత్వ - 3, కేజీబీవీ - 11, మోడల్ స్కూళ్లు - 2, ప్రైవేట్ - 45, రెసిడెన్షియల్ - 1, మైనారిటీ రెసిడెన్షియల్ - 1, సోషల్ వెల్ఫేర్ - 3, ట్రైబల్ వెల్ఫేర్ - 2, జెడ్పీ స్కూళ్లు - 71.

జిల్లాలో ఎస్సెస్సీ ఫలితాలు

విద్యా సంవత్సరం	ఉత్తీర్ణతశాతం
2016 - 17	89.43
2017 - 18	89.80
2018 - 19	96.63
2019 - 20	100
2020 - 21	100
2021 - 22	96.58
2022 - 23	93.32
2023 - 24	92.71
2024 - 25	94.65

(2019 - 20, 2020 - 21 కరోనా బ్యాచ్‌లు)

జూన్ 3 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

కామారెడ్డి టౌన్: పదో తరగతి పరీక్షాఫలితాలు వెలువడిన నేపథ్యంలో అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని డీఈవో ఎస్ రాజు తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఫీజు చెల్లింపునకు మే 16వ తేదీ తుది గడుని, విద్యార్థులు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం మే 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ. 500 చొప్పున చెల్లించాలన్నారు. అలాగే జవాబు పత్రాలు ఫొటో కాపీ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించాలన్నారు.

● అక్షయ కళ



అక్షయ తృతీయను పురస్కరించుకొని ఎల్లారెడ్డి పట్టణంలోని బంగారు దుకాణాలు బుధవారం కొనుగోలుదారులతో కళకళలాడాయి. మంచి రోజు కావడంతో బంగారం, వెండి కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి కనబర్చారు. బంగారం ధర లక్ష రూపాయల మార్కు నుంచి బుధవారం రూ.98 వేలకు దిగింది. - ఎల్లారెడ్డిరూరల్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశం ధాన్యం సేకరణే..
- బ్యాంక్ గ్యారెంటీల అంశంలో రైస్‌మిల్లర్లకు మినహాయింపు ఉండదు
- వీసీలో మంత్రి ఉత్తమ్‌కుమార్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశం ధాన్యం సేకరణే అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడగా, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు తాడ్వాయి మండల కేంద్రం నుండి వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రైస్ మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీల విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. అవసరమైతే ధాన్యాన్ని గోదాములకు తరలించాలని అన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

జిల్లాలో ఇప్పటివరకు 446 కొనుగోలు కేంద్రాల ద్వారా 22,785 మంది రైతుల నుంచి 1,81,776 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. 1,01,038 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.234.41 కోట్ల చెల్లింపులు పూర్తయ్యాయని, 5,315 మంది రైతులకు సన్న ధాన్యానికి రూ.25.89 కోట్ల బోనస్ చెల్లించామని వివరించారు. ఆర్డీవో వీణ, డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, సహకార అధికారి రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, డీఆర్డీవో సురేందర్, డీపీవో మురళి, మార్కెటింగ్ అధికారిణి రమ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలి



ఇబ్రహీంపేట్‌లో మాట్లాడుతున్న పోచారం

బాన్సువాడ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్‌లో దళిత నాయకులు, అంబేడ్కర్ యువజనసంఘం ప్రతినిధులతో కలిసి బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులు పోచారంను సన్మానించి అంబేడ్కర్ ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు మాలెపు నారాయణరెడ్డి, కాసుల రోహిత్, నెర్రె నర్సింహులు, ఉద్దర హన్మాండ్లు, బంగారు మైసయ్య, గ్రామ అధ్యక్షులు శివయ్య, చెట్లూరి సాయిలు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



సిర్‌సముందర్‌లో జెండా ఎగురవేస్తున్న తోట..

బాబాసాహెబ్ అందరివాడు..

బిచ్కుంద(జుక్కల్): డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, ఆయన అందరివాడని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సిర్‌సముందర్‌లో బుధవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. విగ్రహ దాత, కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సీమ గంగారాంను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగ్‌నాథ్, ధర్పల్ గంగాధర్, సీమ గంగారాం, గోపాల్‌రెడ్డి, నాగనాథ్ పటేల్, దళిత నాయకులు తుకారాం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పోర్టల్ తీసుకువచ్చింది
- వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసుకోవచ్చు
- అవగాహన సదస్సులో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



రాజంపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రాజంపేట/తాడ్వాయి/కామారెడ్డి రూరల్ : భూసమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతిని తీసుకొచ్చిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. రాజంపేట, తాడ్వాయి మండల కేంద్రాలతోపాటు కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి రైతు వేదికల్లో బుధవారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ధరణికి బదులు తీసుకొచ్చిందని భూ భారతితో ప్రతి ఒక్క రైతుకూ మేలు జరుగుతుందన్నారు. సెక్షన్ నాలుగు ప్రకారం హక్కుల రికార్డులో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో పేర్లు లేని వారికి హక్కుల రికార్డులో పేరును నమోదు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.సెక్షన్ ఐదు ప్రకారం వ్యవసాయభూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసుకోచ్చని తెలిపారు. 2014 జూన్ 2కు ముందు సాదాబైనామా ద్వారా భూమి కొనుగోలు చేసి క్రమబద్ధీకరణకోసం అందిన దరఖాస్తులపై ఆర్డీవోల ద్వారా విచారణ చేపట్టి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డుల మాదిరిగా రైతులకు భూధార్ కార్డులను జారీ చేస్తామని తెలిపారు. గతంలో ధరణీలో అప్పీలు కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్ళవలసి ఉండేదని, ప్రస్తుతం తహసీల్దార్ ఇచ్చిన తీర్పులో అభ్యంతరం ఉంటే ఆర్డీఓ కు, ఆర్డీఓ తీర్పులో అభ్యంతరం ఉంటే కలెక్టర్ కు అప్పీలు. చేసుకోవచ్చని, కలెక్టర్ ఇచ్చిన తీర్పు అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ కు అప్పీలు చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఆర్డీవో వీణ మాట్లాడుతూ.. ధరణిలో 33 మాడ్యూల్స్ ఉండేవని, భూభారతి చట్టంలో కేవలం 6 మాడ్యూల్స్‌లతో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి వీలవుతుందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు మాట్లాడుతూ.. మండలంలో ఇనాం భూములు కలిగిన రైతులకు పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మండలాల ప్రత్యేకాధికారులు రాజారాం, అపర్ణ, తహసీల్దార్లు రహీమొద్దీన్, సతీశ్‌రెడ్డి, ఎంపీడీవోలు సయ్యద్ సాజీద్‌అలీ, రఘురాం, సింగిల్‌విండో చైర్మన్‌లు నల్లవెల్లి అశోక్, కంది శివరాములు, కపిల్‌రెడ్డి పాల్గొనగా, చిన్నమల్లారెడ్డిలో నిర్వహించిన సదస్సులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ధర్మగోని లక్ష్మీరాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగంపేట మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో 3,700 దరఖాస్తులు అందాయని వివరించారు. మొత్తం తొమ్మిది టీములను ఏర్పాటు చేశామని, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, సర్వేయర్ల టీముల్లో ఉంటారని, ఒక్కో టీము 400 దరఖాస్తులను పరిశీలించాలని టీములకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ సురేశ్‌కు సూచించారు. అదనపు కలెక్టర్ విక్టర్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్లుప్తంగా

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దేవులా

కామారెడ్డి అర్బన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి దేవులా, ఉపాధ్యక్షులుగా పి.శ్యాంకుమార్, కే.శ్రీవాణి, సీహెచ్.రాజేందర్, ప్రధానకార్యదర్శిగా ఎన్సీ ప్రభాకర్, కార్యదర్శులుగా చిన్న స్వామి, వంశీధర్, టి.గంగారాం, రాష్ట్ర కౌన్సిలర్లుగా పి.విజయరామరాజు, జి.సునంద, ఆడిట్ కన్వీనర్‌గా బి.బాబురావు, సభ్యులుగా చిన్నరాజయ్య, ఏ.రాములు, అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా దిలీప్, సభ్యులుగా వినోద్, అరవింద్ ఎన్నికయ్యారు.

బాల్య వివాహాలపై అవగాహన



కామారెడ్డి టౌన్: బాల్య వివాహాలు నిరోధించాలని సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆలయాలు, మసీదులలో ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల జరగకుండా పురోహితులు, మత పెద్దలు చూడాలని సంస్థ ప్రతినిధులు కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ గిరిజా, మమత తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కుప్రియాల్ వాసుల భజన కీర్తనలు

సదాశివనగర్: మండలంలోని కుప్రియాల్‌కు చెందిన సత్యానంద భజన మండలి సభ్యులు బుధవారం తిరుపతిలో నిర్వహించిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొని కీర్తనలను ఆలపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధి రాజిరెడ్డి, మండలి సభ్యులు పాల్గొన్నారు.

చెరువుకు మరమ్మతులు చేయాలి

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గం మానాల పరిధిలోని కీమానాయక్ తండాలో తెగిపోయిన చెరువు కట్టకు త్వరగా మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. మానాల పరిధిలోని సర్పంచ్ తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం వేల్పూర్‌లో ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే స్పందించి వర్షాకాలం వస్తున్నందున మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఘనంగా బసవేశ్వర జయంతి



బసవేశ్వర చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, సిబ్బంది



బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో..

కామారెడ్డి అర్బన్/ బాన్సువాడ రూరల్/ బిచ్కుంద/ పెద్దకొడప్‌గల్/ ఎల్లారెడ్డి/ పిట్లం/ కామారెడ్డి టౌన్: కవి, ఆధ్యాత్మిక తత్వవేత్త, సంఘ సంస్కర్త బసవేశ్వర జయంతిని బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలు ప్రజా, రాజకీయ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. బసవేశ్వరుడు కుల వ్యవస్థ లేకుండా అందరికి సమాన అవకాశాలుండాలని ఆకాంక్షించారని అన్నారు. బాన్సువాడలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బసవేశ్వర జయంతి నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గులాం ముస్తఫా, అక్బర్ బాషా, పోతరాజు శ్రీనివాస్, విఠల్, శంకర్రావు, అంబయ్య, బాలరాజు, వినయ్‌కుమార్, చిరంజీవి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని రాజుల్లా చౌరస్తాలో బిచ్కుంద బండయప్ప మఠం పీఠాధిపతి శ్రీ సోమయప్ప స్వామి, బీజేపీ నాయకులు అరుణతార జెండా విష్కరణ చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జునప్ప షెట్కార్, నాగ్‌నాథ్ పటేల్, మాశెట్టి సంజీవ్, రాజు పటేల్, నాయకులు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని వీరశైవ లింగాయత్ మండల అధ్యక్షుడు సంతోష్ దేశాయ్ బసవేశ్వర పతాకాన్ని ఆవిష్కరించారు. బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, వివిధ పార్టీల నాయకులు, లింగాయత్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకుని వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షులు వీరప్ప నీలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు బసప్ప, రామప్ప, సంగమేశ్వరప్ప తదితరులున్నారు. పిట్లం మండలంలోని కంబపూర్‌లో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా



పెద్దకొడప్‌గల్‌లో..

బసవేశ్వర విగ్రహావిష్కరణ చేశారు. విగ్రహానికి గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో ఉన్న ఓంకారేశ్వరాలయంలో వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కంది శివరాములు, వీరన్న పటేల్, పట్నం శెట్టి శ్రీనివాస్, ఎం ఆంజనేయులు, జీవన్ దేశాయ్, పటేల్ రాజు, బండాయ స్వామి, మారుతి, చంద్రం, ఇంద్రశేఖర్, రామ శంకర్, అర్చకులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో నివాళులర్పిస్తున్న నాయకులు



పిట్లం మండలం కంబపూర్‌లో..



జిల్లా కేంద్రంలోని ఓంకారేశ్వరాలయంలో..

భవన నిర్మాణాలకు భూమిపూజ

కామారెడ్డి అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవోస్) భవన నిర్మాణ పనులకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. వేదపండితుడు జి ఆంజనేయశర్మ పూజలు నిర్వహించి ప్రతినిధులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భవన నిర్మాణానికి స్థలం కేటాయించిన కలెక్టర్ కు టీఎన్జీవోస్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముల్క రాజు, అసోసియేట్ అధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, ప్రతినిధులు లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, బి రాజేశ్వర్, పోచయ్య, రాజ్‌కుమార్, సంతోష్‌కుమార్, సాయినాథ్, పవన్, కిషన్, అనుదీప్, సురేఖ, శివకుమార్ ఆయా శాఖల నాయకులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

ఆర్ఎస్ఎస్ భవనానికి..

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఎన్జీవోస్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. కేశవ ట్రస్ట్ పేరిట



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

ప్లాటు కొనుగోలు చేసి దాదాపు రూ.కోటి వ్యయంతో భవనాన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు బి.శంకర్, నగర అధ్యక్షుడు కే.స్వామి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రంజిత్ మోహన్, ఎం.శ్రీకాంత్, నాయకులు ఆకుల భరత్ కుమార్, నరేందర్, రాజు పాటిల్, కాసర్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను పరిష్కరించాలి

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

కామారెడ్డి క్రైం: రెవెన్యూ సదస్సుల దృష్టికి వచ్చిన ప్రతి భూసమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. భూభారతి చట్టంపై పైలెట్ మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న రాష్ట్రం లోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. లింగంపేట్ తహసీల్ కార్యాలయం నుంచి కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ మాట్లాడుతూ.. భూభారతి చట్టం అమలులో భాగంగా ముందస్తుగా నాలుగు పైలెట్ మండలాలను ఎంపిక చేసుకొని, రెవెన్యూ సదస్సులను నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. సదస్సుల్లో భాగంగా భూసమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించి సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

వీసీలో భాగంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. లింగంపేట్ మండలంలో ఉన్న 23 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, దాదాపు 3,700 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సర్వే నంబర్ సమస్యలు, విస్తీర్ణ సమస్యలు, సాదా బైనామా లాంటి పలు రకాల భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని కమిషనర్‌కు వివరించారు. భూభారతి చట్టం నిబంధనల ప్రకారం దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ వి విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, ప్రత్యేకాధికారి రాజేందర్, తహసీల్దార్ సురేశ్, భూ కొలతల సహాయ సంచాలకులు ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల బతుకుల్లో కానరాని కాంతులు

- యూనియన్‌లు ఉన్నా.. పోరాటాలు చేసినా మారని జీవితాలు
- నేడు కార్మికుల దినోత్సవం 'మేడే'

ఆర్మూర్: కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ శాఖను ఏర్పాటు చేసినా వారి బతుకులు మారడం లేదు. కార్మికుల పక్షాన పోరాటాలు చేయడానికి అనేక యూనియన్‌లు పుట్టుకొచ్చినా, ఉద్యమాలు చేసినా వారి జీవితాల్లో కాంతులు నిండటం లేదు. కనీసం ఉద్యమంలో పాల్గొని సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలోనైనా తమ బతుకులు మారేనా అని కార్మికులు పదకొండేళ్లుగా ఆశగా ఎదురు చూస్తూనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. మే 1న ప్రపంచ వ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నా కార్మికుల బతుకులు చీకటిలో మగ్గిపోతున్నాయనేది అక్షర సత్యం.

జీపీ కార్మికుల వెట్టి చాకిరీ..

జిల్లాలో పారిశుద్ధ్య కార్మికులు వెట్టి చాకిరీ చేస్తున్నారు. అనేక మంది కార్మికులకు చాలీచాలని జీతాలతో పొట్ట గడవడం కష్టంగా ఉంది. పంచాయతీల ఆదాయం, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా వేతనాలను చెల్లించాలని కార్మికులు ఉద్యమాలు చేసిన ఫలితంగా ఇటీవల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. కానీ మూడు, నా లుగు నెలల వేతనం పెండింగ్‌లో ఉంచి వేతనాల చెల్లింపు చేయడంతో కార్మికులు ఇక్కట్లు పడుతున్నారు.



గ్రామాల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

బీడీ కార్మికులకు చేతి నిండా పని కరువు..

జిల్లాలో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది బీడీ పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్నారు. పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు వెయ్యి బీడీలు చుడితే రూ.250 కూలీ, పీఎఫ్ లేని వారికి రూ.270 లభిస్తున్నా యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరుతో చేతి నిండా పని లేకుండా పోయింది. బీడీలు చుట్టేందుకు కార్మికులు ముందుకు వచ్చినా వర్డీ బీడీల వల్ల వెయ్యి బీడీలకు సగం కూలీ తీసుకోవాల్సి వస్తోంది. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులు, బీ డీ కార్మికుల వేతనాలకంటే ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల పరిస్థితి బాగుంది. కూలీలకు పని సమయం తక్కువగా ఉన్నా, రోజు కూలీ లభిస్తుండడంతో పనులు భేషుగ్గా ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు సరైన ఉపాధి, సకాలంలో వేతనాలు అందించాలని పలువురు కోరుతున్నారు.

నగదు, ఆభరణాల కోసమే మహిళ హత్య

- లింగంపేట మర్డర్ కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం: లింగంపేట మండల కేంద్రంలో ఈనెల 23న వెలుగు చూసిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఒంటరిగా నివసిస్తున్న మహిళ వద్దనున్న నగదు, ఆభరణాల కోసమే నిందితుడు హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర వివరాలు వెల్లడించారు. లింగంపేటకు చెందిన లక్ష్మి(45) ఒంటరిగా ఉంటూ స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆమె భర్త ప్రభాకర్ గతంలో అనారోగ్యంతో మృతి చెందగా కుమార్తె శిరీషకు వివాహం జరిగి హైదరాబాద్‌లో ఉంటుంది. ఇటీవల ఆమెకు కన్నాపూర్ గ్రామానికి చెందిన మరో కూలీ గారబోయిన శ్రీకాంత్‌తో పరిచయం ఏర్పడింది. ఈనెల 20న శ్రీకాంత్ ఆమె ఇంటికి వెళ్లగా, ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలపై కన్నేశాడు. ఎవరూ లేనిది చూసి చీరతో మెడకు ఉరివేసి హతమార్చాడు. అనంతరం మృతురాలి సెల్‌ఫోన్ తీసుకుని, ఇంటికి ఓ తాళం బిగించి, ఆభరణాలు, నగదుతో ఉడాయించాడు. ఆమె కుమార్తె ఫోన్ చేయగా లేపకపోవడంతో ఇంటి పక్కింటివారిని సంప్రదించింది. వారు ఇంటికి వెళ్లగా దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా సాంకేతిక పరిజ్ఞానం సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. అతడిని బుధవారం లింగంపేట వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడు గతంలో ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో కూడా ఇలాంటి హత్యకే పాల్పడ్డాడని, పలుమార్లు జైలుకు సైతం వెళ్లి వచ్చాడని, అతడిపై మొత్తం 9కేసులు ఉన్నాయని ఎస్పీ వివరించారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస రావు, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై వెంకట్ రావు, సిబ్బంది మురళి, జవ్వి నాయక్, శ్రీనివాస్ లను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

డిచ్‌పల్లిలో ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. నాగ్‌పూర్ గేట్ సమీపంలో నివసిస్తున్న రాజవరపు మల్లిఖార్జున్ (44) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మంగళవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు.

ఎల్లారెడ్డి మండలంలో వృద్ధురాలు..

ఎల్లారెడ్డిరూరల్: మండలంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన బండారి విఠవ్వ (63) కుటుంలో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈక్రమంలో తన కుమారుడు, కోడలు ఆమెను బెదిరించడంతో మనస్థాపం చెంది ఇంట్లోని యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన

క్రైం కార్నర్

వైద్యం కోసం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కామారెడ్డిలో యువకుడు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ జూనియర్ కళాశాల హాస్టల్ భవనం ఆవరణలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా.. దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన శివాయిపల్లి కార్తిక్(23) కామారెడ్డిలోని కలిక్‌నగర్‌లో గల ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతడి తల్లిదండ్రుల ఆరోగ్యం కొద్దిరోజులుగా సరిగా ఉండటం లేదు. అలాగే ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు బుధవారం సాయంత్రం హాస్టల్ ఆవరణలోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీకి పాల్పడ్డ మహిళ రిమాండ్

సిరికొండ: మండల కేంద్రంలో ఇటీవల చోరీకి పాల్పడ్డ మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రామ్ బుధవారం తెలిపారు. సిరికొండలో కిరాయికి ఉంటున్న తిరుపతి ఏప్రిల్ 28న ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లాడు. తిరిగివచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో, బంగారం, నగదు చోరీ అయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ధర్పల్లి సీఐ భిక్షపతి ఆధ్వర్యంలో విచారణ చేసి చోరీకి పాల్పడ్డ మహిళను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితురాలిపై సుమారు ఇప్పటికే 16 కేసులు ఉన్నాయని ఎస్సై తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌లోని కమలానెహ్రూ కాలనీలో సోదాలు చేస్తున్న పోలీసులు

ఆర్మూర్: ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు పాటిస్తూ అద్దెకు ఇవ్వాలని ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి సాయికిరణ్ సూచించారు. పట్టణంలోని కమలానెహ్రూ కాలనీ, టీచర్స్ కాలనీల్లో బుధవారం తెల్లవారు జామున కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐలు సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, తొమ్మిది మంది ఎస్సైలు తమ 110 మంది పోలీసు బలగాలతో ఆయా కాలనీని జల్లెడ పట్టారు. ప్రతీ ఇంటిలో సోదాలు నిర్వహిస్తూ 9మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 10 బైక్‌లను, రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్ద తండాకు చెందిన ఓ యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. వివరాలు ఇలా.. తండాకు చెందిన అర్చన(19) అనే ఇంటర్ విద్యార్థిని మంగళవారం సోదరుడు అరవింద్‌తో కలిసి ఈఏపీసెట్ పరీక్ష రాశారు. బుధవారం ఉదయం అరవింద్, అర్చన ఇద్దరు కలిసి బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామం నల్లమడుగు పెద్ద తండాకు బయలుదేరారు. మేడ్చల్ రింగ్ రోడ్డు సమీపంలో వీరి బైక్‌ను ఓ లారీ వెనుక నుంచి వచ్చిన ఢీకొట్టింది. ఈ ఘటనలో అర్చన అక్కడికక్కడే మృతి చెందగా, అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైలు ఢీకొని వృద్ధురాలు..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయరెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన రాయ సాయవ్వ (65) బుధవారం ఉదయం డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా అప్పుడే వేగంగా వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈఘటనలో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

దాబా పైనుంచి పడి యువకుడు..

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఓ యువకుడు దాబా పైనుంచి కింద పడి మృతిచెందాడు. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ప్రాంతంలో నివసించే షేక్ అజహర్ (29) పెయింటర్‌గా పని చేస్తూ, మద్యానికి బానిసగా మారాడు. దీంతో అతడి భార్య కొన్ని నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న అజహర్ తమ ఇంటి దాబా పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబీకులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి తస్లీమ్‌బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాన్ కింద పడి బాలుడు..

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్ గ్రామంలో డీజే బాక్సుల వ్యాను కింద పడి ఓ బాలుడు మృతి చెందినట్లు ఎస్సై రామ్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన మాలావత్ బాలు కుమారుడు జగదీష(13), గణేష్ అనే వ్యక్తి తో కలిసి వ్యానులో మంగళవారం రాత్రి డీజే బా క్సులు తీసుకురావడానికి వెళ్లాడు. గణేష్ వాహనా న్ని అజాగ్రత్తగా నడపడంతో వ్యాను వెనుక బాక్సులపైన కూర్చున్న జగదీష్ కింద పడిపోయాడు. అతడి తలపై నుంచి వాహనం వెళ్లడంతో జగదీష్ అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జగదీష్ (ఫైల్)

తాళం వేసిన రెండిళ్లల్లో చోరీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తాళాలు వేసిన రెండు ఇళ్లల్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన వంకాయపల్లి సాయిలు భార్య ఇంటికి తాళం వేసి ఇతర గ్రామాలకు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి ఇంట్లో ఉన్న తులం బంగారం పడిగెలు, అరతులం కమ్మలు, అరతులం గుండ్లు, 40తులాల వెండి కాళ్ల కడియాలు, పట్ట గొలుసులు, రూ.8వేల నగదును దొంగలించారు. అదే గ్రామానికి చెందిన జోగు పరుశరాములు ఇంటి తాళం పగులగొట్టి 7తులాల వెండి పట్టగొలుసులు, బంగారు నగలు, రూ.39వేల నగదును దొంగలించారు. బాధితుల సమాచారం మేరకు ఎస్ఐ రాజయ్య ఘటనస్థలాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ నుంచి రోడ్డుపై పడ్డ ధాన్యం బస్తాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): వడ్ల సంచుల లోడ్‌తో ఉన్న లారీ బుధవారం లింగంపేట్ నుంచి కామారెడ్డి వైపు వెళుతుండగా సంచులు రోడ్డుపై పడ్డాయి. అక్కడ ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. 20 సంచుల వరకు రోడ్డుపై జారిపడ్డాయి. స్థానికులు గమనించి, డ్రైవర్‌కు తెలపడంతో అతడు లారీని ఆపి, సంచులను మళ్లీ ఎక్కించుకొని బయలుదేరాడు. సంచులు పడే సమయంలో ఇతర వాహనదారులు ఉంటే ప్రమాదం జరిగిఉండేదని, ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం గాలీపూర్ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణం దుకాణం పూర్తిగా దగ్ధమైంది. గ్రా మానికి చెందిన గంజి రాజు కిరాణం దుకాణంలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కిరాణ సామగ్రి తగలబడటంతోపాటు నగదు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. స్థానికులు గమనించి బిందెలతో నీటిని తీసుకువచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో దుకాణం పూర్తిగా కాలిబూడిదయింది. ఈ ప్రమాదంలో రూ. 2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిసింది.

యువకుడి అదృశ్యం



రవీంద్ర నిఖిల్(ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని పెద్దబజార్ ప్రాంతానికి చెందిన మామిండ్ల రవింద్ర నిఖిల్ అనే యువకుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 28న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చాలాచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి తల్లి నందిని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఎల్లారెడ్డి అటవీ ప్రాంతంలో కూంబింగ్ ..!

కామారెడ్డి క్రైం: ఎల్లారెడ్డి అటవీ ప్రాంతంలో బుధవారం ప్రత్యేక పోలీసు బలగాల బృందం కూంబింగ్ నిర్వహించినట్లు తెలిసింది. తెలంగాణ–ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో కేంద్ర భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్ పేరిట భారీ ఆపరేషన్ చేపడుతున్న తరుణంలో జిల్లాలో పోలీసులు కూంబింగ్ నిర్వహించడం చర్చనీయాంశమైంది. కాకపోతే పోలీసు శాఖలో శిక్షణలో భాగంగా కూంబింగ్ చేపట్టడం సహజమేననీ, ఉన్నతాధికారుల సూచనల మేరకు శిక్షణలో భాగంగానే అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

జిల్లాలో 30,30 ఏ పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లాలో నెలరోజుల పాటు (మే 1నుంచి 31 వరకు) 30, 30 ఏ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని అనుకుంటే సంబంధిత డివిజన్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, కార్మిక, వివిధ సంఘాలు దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.